# మోతుబరి

'నాని'

“చూశావా ఎంత పని జరిగిందో! మన ఎంకాయ్ తమ్ముని ఆ బద్రిగాడు పొట్టనెట్టుకున్నాడు,” అన్నాడు సుబ్బయ్య రొప్పుతూ.

అతను అప్పుడే భద్రయ్యగారి ఇంటినుండి పరుగు పరుగున వచ్చాడు.

“ ఏంటిరా. ఏంటి. అంత సిన్నోణ్ణి ఎట్టా సంపాడురా? అసలాడికి సేతు లెట్టొచ్చాయి?” బాధగా అడిగాడు కిట్టమ్మ.

“రావాయణవంతా ఇని రావుడికి సీతేంచౌతుంది అన్నట్టుంది. ఈ సావుకార్ల ఊసు ఎరగనట్టే వాగుతావేరా?” అన్నాడు సుబ్బయ్య అసలు విషయం మర్చిపోతూ.

“సరి సరి అసలిసయం సెప్పొరా. ఎట్టా సంపడు, ఏంటి కత. ఎంకాయ్ ఏవన్నాడు? సెప్పు సెప్పు.” అన్నాడు కిట్టమ్మ ఆత్రుతగా.

“సెప్తున్నానా, ఇనుకో మరి. సిన్నోడు గొడ్లకి సీలెట్టకండా పొలం పోయాడు, ఇంకే——దొరికిందే సందని బద్రిగాడు ఓ ‘సిన్న’ దెబ్బేశాడు, ఏసే తలికి మనోడు తప్పుకుందావని సూసాడు. ఇట్టా వుందా నీపనని బద్రిగాడు సిన్నోణ్ణి మావిడి సెట్టుకి కట్టేసి బాదాడు. తెలుసుగా ఆడి దెబ్బలు ఎట్టుంటయో........”

“అబ్బ అసలిసయం సెప్పురా.”

“ఇను మరీ. బాదాడు బాదాడు... కసిదీరా బాదాడు సిన్నోడు సచ్చాక. నెత్తి మీద కొచ్చుద్దని దిగుడు బావిలోకి తోసేసాడు, ఆడి గుట్టు దాగుద్దా? వూరంతా టాం టాం అయింది. ఎంకాయ్ అమ్మ వూరుకుంటుందా? ఏసుకుంది నా సావిరంగా....”

“దానికి కోపం కంటె బాదెక్కువరా, దాని దాకా ఎందుకు. మనకి లేదూ బాద? సిన్నోడు మనవంటె ఎంతిదిగా వుండే వోడు! ఆడి సిన్న కళ్లు ఎప్పుడు తళుక్కు తళుక్కు మనేవిరా, నేనంటేఆడికి మరీ పానం, ఎట్టా బరించాడో ఆ గొడ్డు దెబ్బలు?” అన్నాడు కిట్టమ్మ పైపంచి నోటికి అడ్డం పెట్టుకుంటూ.

632

"నీకేనేంటిరా, మాకులేదూ ఆడిమీదపేమ? మీరోరూలేనపుడు మేవిద్దరవే సేలో ఆడుకునే వోల్లం. ఆడెన్ని ఆటలాడేవోడో అంతపని సేసేవోడు. ఒక్కరోజు పని మానుకుంటేనే అట్టా బాదాలా? ఆ బద్రి అసలు మడిసికాడురా" అన్నాడు సుబ్బయ్య కొత్త సంగతి తెలుసుకున్నట్టు.

"ఇంతకీ ఎంకాయ్ ఏడున్నాడు?"

"ఆడు ఈ సావుకబురు ఇనే తలికి శానా ఇదయి పోయాడు. ఆ బదిరి గాడ్ని....?" అంటూ పళ్లనూరాడు సుబ్బయ్య.

"ఆగసే, అంత దూకుడు కూడదు, ఎంకాయ్‌నికూడా రానియ్ ఆలోసిద్దాం" అంటూ సర్దబోయాడు కిట్టమ్మ.

"ఇంకా ఏవనాగుతాంరా? ఆడుసేసిన గోరాలు కూసినా కాసినా? నేనొక్క డ్నైతేనా! ఈ తలికి ఆడి రత్తం కల్లసూసేవోడివి. లేప్పోతే అంత సిన్నోడిమీద సెయ్యి సేసుకోటానికి ఆడికేంటొసే అక్కు?" అన్నాడు సుబ్బయ్య రెచ్చిపోతూ.

భద్రయ్యగారు ఆ వూళ్లోకల్లా మోతుబరి. నూరెకరాల ఆసామి. పేరు మోసిన వడ్డీ వ్యాపారి. చాలామంది ఆయన దగ్గర నగలు, ఇళ్లు, పొలాలు తాకట్టు పెడతారు. నూటికి పదిమంది కూడా వాటిని విడిపించుకోలేరు. అందువల్ల ఆయన ఆస్తిలో కలిసిన ఇళ్లస్థలాలకు, పొలాలకు; ఆయన భార్య ఒంటిమీద పెరిగిన నగలకూ అంతులేదు. డబ్భై ఏళ్లదాటినా దుక్కలా తిరుగుతారు. అప్పుల వసూళ్లకోసం ఎంత దూరమైనా సరే వెళ్తారు. అసలు ఫాయిదాలు ముక్కుపిండి వసూలు చేయడంలో ఆయన్ని మించిన చెయ్యి ఆ చుట్టుపక్కల లేదు.

పాలేళ్ళ దగ్గర్నుండీ ఇంట్లో పిల్లలదాకా ఆయన్ని చూస్తే హడిలిపోయేవారే. ఆయన కొట్టినా, తిట్టినా అడిగినప్పుడల్లా తాకట్టుపెట్టుకుని అప్పులిస్తారు కనుక పాలేళ్లు ఆయనదగ్గర పనికి కుదురుకునేవారు. ఆస్తికి యజమాని కనుక ఇంట్లో భార్యాబిడ్డలు కిక్కురుమనే వారుకాదు. ఆయన నోటికీ, ఆస్తికీ జడిసి ఊళ్ళోవాళ్ళు చెప్పుకింద తేళ్ళలా పడివుండేవారు. ఎదురుగా ఏమీ అనకపోయినా బీదా బిక్కీ చాటున పళ్ళు నూరేవారు. అందుకు కారణం ఆయన చిన్నప్పట్నుండీ ఒక్క మంచిపని కూడా చేయకపోవడమే.

"అడుగో ఎంకాయ్ రానే ఒచ్చాడు. ఇక నువ్వు కాసేపు మాటాడమాక. ఆడేవంటాడో ఇందారి" అన్నాడు కిట్టమ్మ ఎంకాయ్‌వైపు తిరుగుతూ.

633

సుబ్బయ్య. ఎంకాయ్. కిట్టమ్మ — ముగ్గురూ ఒకటే గుటక. వాళ్ళను చూసి గిట్టనివాళ్లు కళ్లల్లో నిప్పులుపోసుకుంటే, అయిన వాళ్ళు త్రిమూర్తులని పొంగిపోయే వారు. ఏపనిచేసినా ముగ్గురూ కట్టకట్టుకుని దూకేవారు. మాలపల్లి జనానికి తలలో నాలుకలాంటి వాళ్లు ఈ ముగ్గురూ.

ఎంకాయ్ తమ్ముడిని మిగతా ఇద్దరూకూడా చాలా గారాబంగా చూసేవారు చిన్నాడు లేడిలా గెంతుతూ చిన్నచిన్నపనులు చేసిపెట్టేవాడు. తనకి లేదనికాక ఇతర్లకి వుండాలనే వుద్దేశ్యంతోనే చాలా పనిచేసేవాడు. 'ఇంత సిన్నప్పట్నుండి ఈడు ఇట్టా ఉన్నాడు, మనని మించిపోతాడురా" అనుకునేవారు ఈ ముగ్గురూ. చిన్నాడు చనిపో యాడని బాధగావున్నా. చంపినవాడిమీద కసి ఎక్కువగా వుంది వీళ్లకి.

* * *

"ఎవరెట్టాపోతే నాకేంగాని, ఈ సావుకార్లు మడుసుల్ని మడుసులిగా సూడ రమ్మా లేప్పోతే సూత్తాసూత్తా ఇట్టా నిండుపేనాన్ని వోరైనా పొట్టనెట్టుకుంటారా?" అంటూ నోరు నొక్కుకుంది పక్కింటి పుల్లమ్మ.

"ఎంత గొప్పోడైనా అంత మిడిసిపాటు పనికిరాదమ్మా. అయినా నాకు తెలవకడుగుతానూ, వూరంతా గుప్పుమన్నాక తల్లిని వదిలిచ్చుకోటానికి సేతులు తడి సేసాడంటాగా?" అంది గట్టవతలి ముక్కులేని సీతాలచ్చి.

"ఎంత వదిలిచ్చుకుందా వనుకున్నా ఎంకాయ్ అట్టా వొదిలేరకం కాద మ్మోయ్. తమ్ముడంటే ఆడికెంత పేమో!"

తనకి కావల్సిన సమాధానం రాకపోయేసరికి పక్కవిడతో ఛేటీ వేసుకుంది ముక్కులేని సీతాలచ్చి.

"ఇంతకీ ఎంతిచ్చాడే?" పక్కవిడ దగ్గరికి జరుగుతూ అడిగింది.

"అదే తెలపటల్లా"— గుసగుసలు.

"బాగానే అందుంటుంది. అందుకే కొడుకుపోయినా అంత నిలకడగా కూకుంది. ఎంత నంగనాచే! ఇట్టాటి తల్లిని నేనెక్కడా సూడలేదమ్మా. ఇదిగో ఇదెక్కడన్నా అనేప్! అయినా నాకెందుకులే. ఎవరిపాటికి అల్లుంటే అందరికీ మంచిది" అంది సీతాలచ్చి ఏదో తొందరపని వున్నట్టు బైటికి వెళ్లిపోతూ.

634

* * *

"ఈసారి తాడోపేడో తేలాల్సిందే" అన్నాడు సుబ్బయ్యా ఉద్రేకంగా.

"ఇంకా ఆ సైపు రాలేదురా" కిట్టమ్మ శాంతపరచాలనే ఉద్దేశ్యంతో మాట కలిపాడు.

"ఇంకెన్నాళ్లురా? ఆడి గోరాలు ఏకరువెట్టనా?" అంటూ సుబ్బయ్యా మొద లెట్టాడు—

"సిన్నప్పటి లీలలు వొదిలేద్దారి. మిగతాయి సెప్తా కాసుకోండి. పదారో ఏట రావయ్యాగారి పాలేర్నితన్నాడు. పడేడోఏట మాలపల్లోరి లచ్చినిసెరిసాడు. కొన్నాల్లు పోయాక గుహప్రవేశానికి మంగలాడెదురయాడని ఆడ్నిసితకబాదాడు. పెల్లిభోజనంలో పొరపాటున వుప్పెక్కువేసిందని మడికట్టుకున్న ముసిల్దాన్ని కర్రెట్టిబాదాడు. అది గుటుక్కుమంటే కేసు కొట్టేయించాశరి ఏరే ఇసయం. అప్పులెగేశాడని కొత్తయ్య గారి రత్తయ్య పెల్లాన్ని ఇంటో కట్టేసుకున్నాడు. పొలంగట్టు దాటొచ్చిందని పేరిగాడి వున్నొక్క గేదినీ తోలుకుపోయాడు...."

"బాబ్బాబు ఇక ఆపరా. ఇప్పటికి యెయ్యిసార్లిన్నాం"

"మరింకా ఆలోసిద్దారంటారేంటి?"— సుబ్బయ్యా ప్రశ్నకి మిగిలిన ఇద్దరూ దీర్ఘాలోచనలో పడ్డారు.

*　　　*　　　*

అక్కడ తులసమ్మ పరిస్థితి ఏమీ బాగోలేదు. పక్కవాళ్ళ సూటీపోటీ మాటలతో ఆమెగుండె మరీతూట్లు పడిపోయింది. చెప్పుకోవటానికి ఎవరూ లేనందు వల్లా. తనలో తనే కుళ్ళి కుళ్ళి ఏడ్చినందువల్లా మొహమంతా వాచిపోయింది. ఎంకాయ్‌ని చూడ్డంతోచే ఆవేదన పెల్లుబికింది.

"ఆల్లందరికీ డబ్బిసయవే పట్టిందిగాని నా బాదెవురికీ పట్టలేదురా నాయినా. ఆడు ఏలే సంపాదిచ్చాలా. లచ్చలే సంపాదిచ్చాలా? బతికి బట్టకడితే సాఁదా? సిన్నోడయినా సిసింద్రీలా పనులన్నీ సిటుకు సిటుకు సేసేవోడు. నాకడుపుకోత ఎవురు తీరుత్తారురా? నన్నుకూడా దేనిలోకయినా తోసేయిరా బాబూ. ఇక నేనెట్టా బతికేదిరా...." అంటూ సొమ్మసిల్లి పడిపోయింది తులసమ్మ.

635

శవపంచాయితీలో చిన్నాడిది "ఆత్మహత్య" అని తేల్చాడు డాక్టరు.

ఇది జరిగిన కొన్నాళ్ళకు పూరంతా కీలకలం రేగింది— ఆతృతగా అడిగే వారూ— చెప్పేవారు, వీళ్ళందర్లో కలవరం రేపిన సంగతి— రావి చెట్టుకింద నిర్జీవంగా పడివున్న భద్రయ్యగారి కళేబరం. ఆ భీకరాకారం ఇప్పుడు ఎవర్నీ భయపెట్టలేకపోతోంది.

అదే సాయంత్రం స్నేహితులు ముగ్గురూ కలుసుకున్నారు. అందరి మొహాల్లో ఏదో సంతృప్తి తాండవిస్తోంది.

"ఇప్పుడు సూడాలి ఆడా పేరు ఏవంటాడో, సినోడ్ది ఆతంహచ్చ అన్నాడే, దీన్ని పేతంహచ్చ అంటాడేమో సుద్దారి" అంటూ చెరువు గట్టువైపుకు దారి తీశారు ముగ్గురూ.

సాహిత్యం మానవుడ్ని పున్నతుడిగాచేస్తుంది. తన్నుతాను తెలుసుకొని ఆత్మవిశ్వాసం పెంచుకుని, సత్యం న్యాయం కోసం పోరాడేట్టు చేయగలిగి వుండాలి. మానవుల్లోని నైచ్యత నిర్మూలించడానికీ, ఉత్తమగుణాల్ని ఉత్తేజిత మొనర్చడానికీ, సమర్థమైనదే సాహిత్యం అని చెప్పితీరాలి. అధర్మంమీద క్రోధం, దౌర్జన్యానికి సిగ్గుపడడం, న్యాయరక్షణకి ధైర్యం, సౌందర్యం అంటే పవిత్రప్రేమ వీటన్నిటినీ మానవుల్లో విజృంభింపజేసేదే, ఉద్దీపింపజేసేదే నిజమైన సాహిత్యం.

636

— మాగ్జిం గోర్కీ